భక్తులకు అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు వంశీధర్‌రావు తదితరులు

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

సిద్దిపేట ఫిబ్రవరి 19: గాయత్రి విశ్వకర్మ భగవాన్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి వంశీధర్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని గాయత్రీ సహిత విశ్వకర్మ భగవాన్ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకుడు వంశీధర్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలకు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తామని, విశ్వకర్మలందరూ ఆర్థికంగా ఎదగాలని భగవంతుడి కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, సురేందర్ గౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19: ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలను విని పరిష్కరించడానికి మొదలుపెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు వచ్చిన వారికి న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం పెరిగిందని, క్రమక్రమంగా అర్జీదారుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. పలు సమస్యలపై మొత్తం 24 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు చేయూత

కొల్గూర్‌లో చిన్నారులకు ఆర్థికసాయం అందజేస్తున్న నీలం మధు

గజ్వేల్, ఫిబ్రవరి 19: మండల పరిధిలోని కొల్గూర్ గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్, కవిత దంపతులు ఏడాది కాలంలో ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు కావ్య, శ్రీవాణి, కుమార్ అనాథలయ్యారు. చిన్నారుల విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం నాయకుడు నీలం మధు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున ఎఫ్‌డీ చేయించి బాండ్‌లను అందించడంతోపాటు నగదు రూ.50వేలు అందజేశారు. భవిష్యత్‌లో చిన్నారులకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం గజ్వేల్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయించడంతోపాటు బీసీడీ నుంచి బీసీ-ఏలో చేర్పించేందుకు కృషి చేయాలని సంఘం సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు గుంటుక శ్రీను, అంజనేయులు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 19: ఏపీపీవీబీ బ్యాంకు మిత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొమురవెల్లి బ్యాంకు మేనేజర్ మల్లేశం, ఐరిక్స్ జిల్లా మెనేజర్ పి.శంకర్ కోరారు. సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఏపీజీవీబీ మినీ బ్యాంకు కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పాస్ బుక్ ప్రింటింగ్ సేవలను పారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు మిత్ర మైక్రో ఏటీఎం ద్వారా పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలు ప్రారంభించామని, ఇకపై ఏపీజీవీబీ మినీ బ్యాంకు కేంద్రంలో ప్రింటింగ్ సేవలు లభిస్తాయన్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకు మిత్ర వద్దనే లోన్, పొదుపు పైసలు కట్టవచ్చాన్నారు. అటల్ పింఛన్ యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి జీవన్ సురక్ష బీమా సేవల కోసం బ్యాంకు మిత్రను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సేవలు అందిస్తాం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 19: వాహదారులకు పారదర్శకంగా సేవలు అందిస్తానని రవాణా శాఖ జిల్లా అధికారి వేణు అన్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీటీవోగా పనిచేసి లక్ష్మణ్ సిరిసిల్లకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో భద్రాచలం రవాణాశాఖ కార్యాలయంలో డీటీవోగా పనిచేస్తున్న వేణు సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధలు పాటించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామని, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పల్లెప్రకృతి వనంలో వెలిసిన గుడిసెలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 19: మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన 35 మంది దళిత కుటుంబాలు పల్లెప్రకృతి వనంలో గుడిసెలు వేసి నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో తమ తాతలు, తండ్రులకు అప్పటి ప్రభుత్వం స్థలాలు ఇచ్చిందని, గత ప్రభుత్వం తమకు దీనికి బదులుగా వేరేచోట స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏండ్లు గడుస్తున్నా తమకు భూమి ఇవ్వకపోవడంతో పల్లెప్రకృతి వనంలోనే గుడిసెలు వేశామని చెప్పారు.

## కుర్చీల బహూకరణ

రాయపోల్, ఫిబ్రవరి 19: దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్ గ్రామానికి మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం సోమవారం గ్రామానికి చెందిన పెద్దలు, స్థానిక నాయకుల ద్వారా 200 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ అంటేనే ఆపద సమయంలో ఆదుకునే వ్యక్తిగా 30 ఏండ్లుగా ఆయనకు దుబ్బాక ప్రజలతో ఎంతో అనుబంధం ఉందన్నారు. అనారోగ్యానికి గురైనా ఫరూఖ్‌హుస్సేన్ త్వరగా కోలుకోని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు బండారు దేవేందర్, ఎంపీటీసీ తిరుపతి, మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ షాషా, తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

చేర్యాల : చుంచనకోట జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**రెండోస్థానంలో చుంచనకోట జట్టు**

చేర్యాల, ఫిబ్రవరి 19: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని జనగామ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మండలంలోని చుంచనకోట జట్టు ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచింది. నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా చేతుల మీదుగా చుంచనకోట జట్టు రూ.20 వేల నగదుతోపాటు షీల్డ్‌ను అందుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటల పోటీలు, యువకుల చదువుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విజేతలను అభినందించారు. కార్యక్రమం లో చేర్యాల వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఆకుల రాజేశ్ గౌడ్, జట్టు సభ్యులు పాల్గొన్నారు.

# పెరిగిన కరువు భత్యాన్ని అమలు చేయాలి

**బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు**

మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు

సిద్దిపేట, ఫిబ్రవరి 19: బీడీ కార్మికులందరికీ పెరిగిన కరువు భత్యం(వీడీఏ) వెంటనే అమలు చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంచె నర్సింహులు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం పెరిగిందన్నారు. ఈ పెరుగుదల 2024 ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. బీడీ ప్యాకర్స్, బట్టి కార్మికులు, టేబుల్ క్లర్క్స్, వాచ్‌మెన్‌లకు నెలకు రూ.339 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన కరువు భత్యంతో రాష్ట్రంలో ఏడు లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. పెరిగిన కరువుభత్యాన్ని అమలు చేయించేందుకు కార్మికుల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బీడీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్, ఉపాధ్యక్షుడు సిద్ధేశ్వర్, బీడీ టేకేదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

# ఆర్డర్ కాపీ లేకుండానే తొలిగించారు

**కలెక్టరేట్ ఎదుట స్టాఫ్ నర్సుల ధర్నా**

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్టాఫ్ నర్సులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19: ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్డర్ కాపీ లేకుండానే.. కేవలం మెసేజ్ వచ్చిందని చెప్పి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ తమను విధుల నుంచి తొలిగించడమేంటని స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వం తొలిగించిన 80 మంది స్టాఫ్ నర్సులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల నుంచి తొలిగించడంతో రోడ్డున పడ్డామన, కరోనా సమయం నుంచి ఎంతో సేవలు చేసిన తమను ఉన్న ఫలంగా తొలిగించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తమను విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌సీల్లో తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

# రైతు వ్యతిరేకి మోదీని గద్దె దించాలి

రైతులకు మద్దతుగా హుస్నాబాద్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 19 : రైతు వ్యతిరేకి ప్రధాని మోదీని గద్దె దింపేందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షకు మద్దతుగా హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కన్నపేట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రైతుల న్యాయమైన కోర్కెలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కేడం లింగమూర్తి, జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, సీపీఐ నాయకుడు కొయ్యడ కొమురయ్య, జేఏసీ కో-కన్వీనర్ సంపత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చందు, ప్రజా సంఘాల నాయకులు మల్లేశం, రవీందర్ గౌడ్, రాజు, అనిల్‌గౌడ్, హరిబాబు, రవీందర్, సోమయ్య, మల్లారెడ్డి, భగవాన్, సంజీవరెడ్డి, రవీందర్, సమ్మయ్య, బాలయ్య, బాలు, వీరన్న, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి

బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేట, ఫిబ్రవరి 19 : భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన కలాల్ శ్రీనివాస్ నియామకమయ్యారు. బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన గోదావరిఖనిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి బీఎమ్ఎస్ పక్షాన అహర్నిశలు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం వారి అభ్యున్నతికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కలాల్ శ్రీనివాస్ నియామకం పట్ల జిల్లా బీఎంఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సిద్దిపేట టౌన్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని సేవకులు

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. పట్టణాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గజ్వేల్‌లో పోలీసుల పటిష్టమైన భద్రత నడుమ హైందవులు ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. శివాజీ భారీ ఫ్లెక్సీతో శోభాయాత్ర నిర్వహించారు.

**- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 19**



గజ్వేల్‌లో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందువులు

## చెరువులోకి నీటి మళ్లింపు

గజ్వేల్, ఫిబ్రవరి 19: రైతులు సాగు చేసిన యాసంగి పంటలు ఎండిపోకూడదనే ఉద్దేశంతో మండల పరిధిలోని బూరుగుపల్లి మాజీ సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డి సొంత ఖర్చులతో కెనాల్ నుంచి నీటిని చెరువులోకి పంపింగ్ చేయిస్తున్నాడు. రైతుల విజ్ఞప్తి మేరకు రూ.1.30లక్షలు ఖర్చుతో కెనాల్‌లో 10హెచ్‌పీ మోటర్ ఏర్పాటు చేసి నీటిని చెరువులోకి మళ్లిస్తున్నారు. ఈ సందర్భంగా రైతుల సంతోషం వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న హన్మకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

## గౌరవెల్లి ప్రాజెక్ట్ ఘనత బీఆర్ఎస్‌దే

**హన్మకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్**

అక్కన్నపేట, ఫిబ్రవరి 19 : గౌరవెల్లి ప్రాజెక్ట్ ఘనత బీఆర్ఎస్‌దేనని హన్మకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం ప్రాజెక్ట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక చొరవ చూపి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి మొదలుపెట్టారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే ప్రతిపక్షాలకు పుట్టగతులు ఉండవని, ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిసి కుట్రలు చేసి కేసులు వేయించారని ఆరోపించారు. అయినప్పటికీ అప్పటి మంత్రి హరీశ్‌రావు సహకారంతో గోదావరి జలాలను తీసుకువచ్చారన్నారు. ప్రాజెక్ట్ ట్రయల్ రన్ విజయవంతం అయ్యిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పెండింగ్ పనులతోపాటు, కాల్వల కోసం రూ. 200 కోట్లు మంజూరు చేశారనే విషయాలను గుర్తు చేశారు. ప్రాజెక్ట్‌లో 1.5 టీఎంసీల గోదావరి జలాలు ఉన్నాయన్నారు. గతంలో ప్రాజెక్ట్ మొదలుపెట్టిన కాంగ్రెస్ తట్టెడు మట్టి కూడా తీయకుండా వదిలేసిందన్నారు. ప్రాజెక్ట్ పనులు కాకుండానే అడ్డదిడ్డంగా కాల్వలను తవ్వి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. కాల్వల వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలుపడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసర్ల అశోక్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు బైరి రవీందర్, అన్నాడి దినేశ్‌రెడ్డి, చిట్యాల సంపత్, మిట్టపల్లి రాజు, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చేర్యాల, ఫిబ్రవరి 19: జనగామ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా చేర్యాల, జనగామ ప్రాంతాల ప్రజలతో మమేకమై ఉంటున్నానని, విజయాలు సాధించినా, ఓటమి పాలైనా ఎన్నడూ కుంగిపోలేదన్నారు. మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్‌తోపాటు ఆడెపు చంద్రయ్య, మహేశ్, నాగుల వెంకటేశం తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, బనుక శివరాజ్, ముస్త్యాల యాదగిరి, రంగు శివశంకర్, తాళ్లపల్లి వెంకటేశ్, రఘువీర్, కర్క సంతోషరెడ్డి, భూమని బాలరాజు, వినీత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చేర్యాలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

## నేటి నుంచి స్థాయీ సంఘం సమావేశాలు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం, గురువారాల్లో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ రమేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం 2వ స్థాయీ సంఘం(గ్రామీణ అభివృద్ధి), 3వ స్థాయీ సంఘం(వ్యవసాయం), 4వ స్థాయీ సంఘం(విద్య, వైద్యం) సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. గురువారం 1వ స్థాయీ సంఘం(ఆర్థిక, ప్రణాళిక), 5వ స్థాయీ సంఘం(స్త్రీ, శిశు సంక్షేమం), 6వ స్థాయీ సంఘం(సాంఘిక సంక్షేమం), 7వ స్థాయీ సంఘం(పనులు) సమావేశాలు జరుగనున్నట్లు జడ్పీ సీఈవో వివరించారు.

## కురుమలు తరలిరావాలి

చేర్యాల, ఫిబ్రవరి 19: కురుమ సంఘం రాష్ట్ర భవన ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఓరుగంటి శంకర్, ప్రధాన కార్యదర్శి అందె నాని కోరారు. సోమవారం పట్టణంలో జరిగిన కురుమల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 25న హైదరాబాద్‌లోని కోకాపేటలో సంఘం భవన ప్రారంభోవానికి కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## చేర్యాల తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్

చేర్యాల, ఫిబ్రవరి 19: చేర్యాల తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జోగినిపల్లి రాజేశ్వర్‌రావు సిద్దిపేట కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సమీర్‌అహ్మద్ ఖాన్ చేర్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్నివర్గాల సహకారంతో ప్రజలకు సేవలు అందిస్తానని తెలిపారు.

## ఈ-కేవైసీ చేసుకోవాలి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 19: జిల్లా రైతులు ఈనెల 22లోగా కేంద్రప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకం కోసం ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. పీఎంకిసాన్ ఈకేవైసీ పూర్తి చేయడంలో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా ముందుస్థానంలో నిలిచిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతులు వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈకేవైసీకి గడువును 22వరకు పొడిగించినట్లు తెలిపారు.

## వంద రోజుల పని కల్పించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 19: వలసలను నివారించి కూలీలకు ఉపాధి కింద పనులు కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొంగ స్వామి కోరారు. సోమవారం మండల పరిధిలోని బూరుగుపల్లిలో ఉపాధి పనులు పరిశీలించిన సందర్భంగా కూలీలతో మాట్లాడారు. వంద రోజుల పని ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు.

మాట్లాడుతున్న సీఈవో వికాస్‌రాజ్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

## ఓటరు జాబితాలో తప్పిదాలుండొద్దు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19: ఓటరు జాబితాలో తప్పిదాలు లేకుండా పకడ్బందీగా పరిశీలన జరపాలని, జాబితాలో మార్పులు, చేర్పులు, పేర్ల తొలిగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్ర స్థాయిలో సర్వే చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా దృష్టి సారించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో నాగరాజమ్మ పాల్గొన్నారు.